క్లుప్తంగా

నేడు మంత్రి మహేందర్‌రెడ్డి రాక

దౌల్తాబాద్‌: మండలంలోని పలు గ్రామాల్లో నేడు (బుధవారం) వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి రానున్నారని ఎంపీపీ విజయ్‌కుమార్‌, జెడ్పీటీసీ మహిపాల్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రకల్‌లో రూ.29లక్షలతో నిర్మించిన మన ఊరు–మన బడి పాఠశాల, మండల కేంద్రంలో రూ.10లక్షలతో నిర్మించిన ఈద్గ, హన్మానాయక్‌ తండా నుంచి అల్లాపూర్‌ వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన, గుండేపల్లిలో గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవం, ఎల్‌జీతండాలో పంచాయతీ భవనానికి శంకుస్థాపన, గోకఫసల్‌వాద్‌లో బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పూడూరు మండల సమావేశం

పూడూరు: పూడూరు మండల సర్వసభ్య సమావేశం నేడు (బుధవారం) ఎంపీపీ మల్లేశం అధ్యక్షతన జరగనుందని ఎంపీడీఓ ఉమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉ.11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో రావాలన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

15న ధారూరు మండల సర్వసభ్య సమావేశం

ధారూరు: ధారూరు మండల సర్వసభ్య సమావేశం 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఉ.11 గంటలకు జరిగే సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మొగులయ్య మృతి పార్టీకి తీరని లోటు

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రసాద్‌కుమార్‌

మోమిన్‌పేట: కాంగ్రెస్‌ పార్టీ మాజీ మండల ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు కె.మొగులయ్య(చిన్న) అకాల మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. మంగళవారం మండలంలోని ఎన్కేపల్లికి చెందిన కిందింటి మొగులయ్య అనారోగ్యం సమస్యతో అకాల మరణం చెందారు. అంత్యక్రియలకు మాజీ మంత్రి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నోరు అదుపులో పెట్టుకో..

జెడ్పీటీసీపై కాంగ్రెస్‌ నాయకుల ఫైర్‌

దౌల్తాబాద్‌: జెడ్పీటీసీ మహిపాల్‌ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని స్థాయికి మించి మాట్లాడితే సహించేది లేదని కాంగ్రెస్‌ నాయకులు భీంరెడ్డి, మొగులప్ప, షకీల్‌ అన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. జెడ్పీటీసీ మహిపాల్‌ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై స్థాయికి మించి మాట్లాడుతున్నాడని సోమవారం కాంగ్రెస్‌ పార్టీలో 200 మంది చేరితే అబద్ధపు చేరికలని జెడ్పీటీసీ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 200మందికి ఒక్కరు తగ్గినా తాము రాజీనామాలు ఇస్తామని లేకపోతే నీవు రాజీనామా చేస్తావాని సవాల్‌ విసిరారు. ఇక ముందు స్థాయికి మించి ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

17నుంచి దర్గా ఉత్సవాలు

పరిగి: మండలంలోని సయ్యాద్‌పల్లిలో ఉర్సు షరీఫ్‌ ఉత్సవాలు ఈనెల 17నుంచి 19వరకు నిర్వహించనున్నట్లు మంగళవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదిన గంధం, చందన పూజలు, 18వ తేదీన దీపారాధన, భజనలు, 19వ తేదీన ఖతం ప్రసాదం, ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కావునా, జిల్లాలోని భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

విద్యార్థులకు నోట్‌ బుక్కులు, ప్యాడ్లు అందజేత



నోట్‌బుక్కులు, ప్యాడ్లతో విద్యార్థులు, ట్రస్టు సభ్యులు

తాండూరు టౌన్‌: శుభప్రద్‌ పటేల్‌ చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ట్రస్టు సభ్యులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్‌ పారామెడికల్‌ కళాశాల విద్యార్థులకు నోట్‌ బుక్కులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. పేద విద్యార్థులకు ట్రస్టు ఎల్లప్పుడూ సహకారం అందిస్తోందని తెలిపారు. భవిష్యత్‌లో ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి భానుప్రసాద్‌, సభ్యులు బాలు, సచిన్‌, హరీష్‌, విజయ్‌, శ్రీశైలం, చందు, నరేష్‌ తదితరులు ఉన్నారు.

మీసేవకు మోక్షమెప్పుడో!

- 21 గ్రామాల్లో భవనాలు పూర్తి
- అందుబాటులోకి వస్తే మరింత సౌకర్యం
- పట్టించుకోని అధికారులు



మల్కాపూర్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మీసేవ భవనం

తాండూరు రూరల్‌: కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 2016 సంవత్సరంలో తాండూరు మండలాన్ని రూర్బన్‌ పథకం కింద ఎంపిక చేశారు. పట్టణ తరహా సౌకర్యాలు గ్రామాల్లో కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం రూర్బన్‌ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా తాండూరు మండలం అల్లాపూర్‌ను (ఎస్‌)క్లస్టర్‌ కింద ఎంపిక చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పథకం కింద అభివృద్ధి పనులు చేశారు. ఇందులో భాగంగానే ప్రతి ఊరికి మీసేవ భవనాన్ని మంజూరు చేశారు. భవనాల నిర్మాణం ఇరిగేషన్‌ శాఖకు అప్పగించారు.

మండలంలో 24 మీసేవ భవనాలు

రూర్బన్‌ నిధులతో తాండూరు మండలంలోని ఆయా గ్రామాల్లో మీసేవ భవనాలను నిర్మించారు. ఒక్కో భవనానికి ప్రభుత్వం రూ.7లక్షలు కేటాయించింది. మొత్తం 24 మీసేవ భవనాలకు గాను 21 పూర్తయినట్లు ఇరిగేషన్‌ అధికారులు చెప్పారు. ప్రస్తుతం అన్నీ భవనాలు ప్రారంభానికి ముస్తాబయ్యాయి.

ఇబ్బందులకు చెక్‌..

ప్రస్తుతం ప్రభుత్వ కార్యకలాపాలు ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. కావునా, గ్రామాల్లో నిర్మించిన మీసేవ భవనాలు ప్రారంభిస్తే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడనుంది. 30 కిలో మీటర్ల దూరం నుంచి ఆయా గ్రామాల ప్రజలు తాండూరు పట్టణానికి వచ్చి దరఖాస్తులు చేసుకుంటున్నారు. రవాణా ఖర్చుతో పాటు ఆన్‌లైన్‌ ఖర్చుల వల్ల పేద ప్రజలకు ఆర్థికభారం పేరుగానుంది. అదే గ్రామాల్లో ఉన్న మీసేవ భవనంలో అన్నీ సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుందని గ్రామస్తులు అంటున్నారు. కులం, ఆదాయం, గ్యాప్‌ సర్టిఫికెట్‌, రేషన్‌కార్డు, కళ్యాణ లక్ష్మి, గృహలక్ష్మి, బీసీ బంధుతో పాటు అనేక సర్టిఫికెట్ల కోసం తాండూరు పట్టణంలోని మీసేవకు వస్తున్నారు.

కలెక్టర్‌ చొరవ చూపాలి

ముఖ్యంగా రూర్బన్‌ పథకానికి సంబంధించిన అన్ని పనులు జిల్లా కలెక్టర్‌ పర్యవేక్షణలో సాగుతున్నాయి. కావున గ్రామాల్లో మీసేవ భవనాలను ప్రారంభించి స్థానికంగా ఆపరేటర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కలెక్టర్‌ చొరవ చూపితే సాధ్యమైతుందని అంటున్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఆదర్శం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: సీఎం కేసీఆర్‌ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు యావత్‌ దేశం తెలంగాణ వైపు చూస్తుందన్నారు. 11 మంది పేదలకు 4 లక్షల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. పల్లె ప్రగతి కార్యక్రమాలతో గ్రామాలు అన్ని అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి చెప్పారు. నవాబుపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ప్రశాంత్‌ గౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రాంరెడ్డి, సర్పంచులు బల్వంత్‌ రెడ్డి, సుధాకర్‌ రెడ్డి, నర్సింలు, మాణిక్‌రెడ్డి, పరమయ్య నాయకులు పాల్గొన్నారు.

యాదయ్య గెలుపును ఎవరూ ఆపలేరు

చేవెళ్ల బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఎమ్మెల్యే కాలె యాదయ్య గెలుపును ఎవ్వరూ ఆపలేరని అక్నాపూర్‌ సర్పంచ్‌ అజయ్‌కుమార్‌ పేర్కొన్నారు. మంగళవారం పలువురు బీఆర్‌ఎస్‌ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పేదల మనిషి నిత్యం ప్రజల్లో ఉండే ఎమ్మెల్యే యాదయ్యకు చేవెళ్లలో తిరుగులేదన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఆయనకు సాటిలేరని కొనియాడారు. అలాంటి వ్యక్తిపై కొంతమంది కళ్లులేని కబోదులు లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ నాయకులు రఘు, బుచ్చయ్య, శాంతకుమార్‌, ప్రకాష్‌, భాస్కర్‌, శేఖర్‌, రాజు, జంగయ్య ఉన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

రామకృష్ణకు జాతీయ విద్యారత్న అవార్డు



ఆహ్వాన పత్రికను రామకృష్ణకు అందజేస్తున్న రాధాకృష్ణ

తాండూరు టౌన్‌: తాండూరుకు చెందిన విద్యావంతుల వేదిక పట్టణాధ్యక్షుడు, విద్యావేత్త పర్యాద రామకృష్ణకు జాతీయ విద్యారత్న అవార్డు వరించింది. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో వచ్చే నెల 15వ తేదీన ఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేయనున్నారు. వివేకానంద, జ్యోతిబాపూలే, అంబేడ్కర్‌, అబ్దుల్‌ కలాం వంటి మహనీయుల భావజాల వ్యాప్తికి కృషి చేస్తూ, విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో తన వంతు పాత్ర పోషిస్తున్న ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మంగళవారం హైదరాబాద్‌లో ఆయనకు ఆహ్వాన పత్రం అందజేశారు. అవార్డు రావడం పట్ల విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్‌ గౌతమ్‌, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌ ఉన్నారు.

అండర్‌-17 జోనల్‌ టీం ఎంపిక



జోనల్‌ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

అనంతగిరి: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని బ్లాక్‌ గ్రౌండ్‌లో వికారాబాద్‌ జోనల్‌ స్థాయి అండర్‌ 17 బాలుర బాలికల క్రికెట్‌ ఎంపిక మంగళవారం జరిగాయి. ప్రతిభ గల విద్యార్థులను ఎంపిక చేశామని జోనల్‌ సెక్రటరీ రవీందర్‌ తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే ప్రగతి



మహిళా సమాఖ్య ప్రతులను విడుదల చేస్తున్న అధికారులు

కుల్కచర్ల: మహిళలు ఆర్థికంగా రాణించినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌ నాయక్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్యలో సంవత్సరకాలంగా మహిళా సంఘాలు చేస్తున్న సామాజిక, ఆర్థిక కార్యక్రమాలపై చర్చించడంతో పాటుగా భవిష్యత్తులో చేయాల్సిన అంశాల గురించి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు వ్యక్తిగతంగా ఆర్థిక అభివృద్ధి చెందడం వల్ల కుటుంబం మొత్తం అభివృద్ధి ఫలాలను పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రణాళికాయుతంగా సద్వినియోగం చేసుకోవడం వల్ల ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, తహసీల్దార్‌ మురళీధర్‌, వ్యవసాయాధికారి వీరస్వామి, కుల్కచర్ల సర్పంచ్‌ సౌమ్యారెడ్డి, మహిళ ఉద్యోగులు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ సెల్‌ పెద్దేముల్‌ అధ్యక్షుడిగా వెంకటయ్య



నియామక పత్రం అందజేస్తున్న రమేష్‌

పెద్దేముల్‌: మండల కాంగ్రెస్‌ పార్టీ బీసీ సెల్‌ అధ్యక్షుడిగా బుద్దారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ రెగోండి వెంకటయ్య ఎంపికయ్యారు. మంగళవారం ఓబీసీ సెల్‌ నియామక పత్రాలను రాష్ట్ర బీసీ సెల్‌ అధ్యక్షుడు లక్ష్మన్‌, ఏఐసీసీ సభ్యుడు రమేష్‌మహారాజ్‌ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌ మహారాజ్‌ మాట్లాడుతూ.. తాండూరులో కాంగ్రెస్‌ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మండల బీసీ సెల్‌ నూతన అధ్యక్షుడు వెంకటయ్య మాట్లాడుతూ.. తనకు ఏ నమ్మకంతో పదవి ఇచ్చిందో అదే నమ్మకంతో పార్టీని ముందుకు తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్‌, పెద్దేముల్‌ మండల ముదిరాజ్‌ సంఘం నాయకుడు బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

కాంగ్రెస్‌ నేత నర్సింగ్‌ నాయక్‌

బంట్వారం: కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలని కాంగ్రెస్‌ పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్‌ నాయక్‌ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఎన్కెపల్లి గ్రామ కమిటీ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాయ మాటలతో మరోసారి మోసగించేందుకు కేసీఆర్‌ సిద్ధమవుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ ఓడిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మైనార్టీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ అన్సారి , బార్వాద్‌ ఎంపీటీసీ నర్సింహారెడ్డి ,నాయకులు వెంకట్రామ్‌రెడ్డి ,ఈశ్వర్‌రెడ్డి ,రామిరెడ్డి , రామునాయక్‌ ,అక్బర్‌ , మహేశ్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

బాలంపేటకు మండల హోదా ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దౌల్తాబాద్‌: మండలంలోని బాలంపేట గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని తిమ్మారెడ్డి పల్లి, సుల్తాన్‌పూర్‌, గుండేపల్లి, అంతారం తదితర గ్రామాల ప్రజలు డిమాండ్‌ చేశారు. మంగళవారం ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, యువకులు భారీగా ర్యాలీగా మండల కేంద్రానికి వచ్చారు. ముందుగా అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. బాలంపేటను మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి అన్ని అర్హతలున్నాయని తెలిపారు. దామరగిద్ద మండలంలోని గత్స, వితలాపూర్‌ గ్రామాలతో కలిపి బాలంపేటను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి. పార్వతమ్మ, పీఏసీఎస్‌ చైర్మన్‌ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటయ్య తదితరులున్నారు.

క్రీడలతో విద్యార్థులకు గుర్తింపు



క్రీడాకారులతో అధికారులు, నేతలు

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌ నాయక్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జోనల్‌స్థాయి వాలీబాల్‌ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడను ఎంచుకుని అందులో రాణించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రహ్లాదరావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, విద్యాధికారి హబీబ్‌ అహ్మద్‌, మాజీ ఎంపీపీ అంజిలయ్య, పీఈటీలు ఖాజ, ప్రవీణ్‌, కేశవులు, కృష్ణారెడ్డి, రాజేందర్‌, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌ రవిచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస ముగింపు పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుల్కచర్ల: శ్రావణమాస ముగింపు వేడుకలను కు ల్కచర్ల మండల కేంద్రంలోని అయ్యప్ప కొండపై వీరశైవ లింగాయత్‌ సమాజం భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగాయి. నిత్యరుద్రాభిషేకంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో మానసిక ప్రశాంతత నెలకొంటుందని అన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఎంహెచ్‌ఎస్‌, పీఓ సాయిబాబా



మహిళా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సాయిబాబా

బంట్వారం: వారానికోసారి ప్రత్యేకంగా మహిళలకు అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంహెచ్‌ఎస్‌- పీఓ సాయిబాబా పేర్కొన్నారు. మంగళవారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి పీహెచ్‌సీల్లో ఆరోగ్య మహిళా కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ , సూక్ష్మ పోషక లోపాలు , మూత్ర నాళ ఇన్‌ఫెక్షన్లు , రుతుస్రావ సమస్యలు, మెనోపాజ్‌, లైంగిక వ్యాధులు , శరీర బరువుపై వైద్య సేవలు అందిస్తారన్నారు. ఇందుకు సంబంధించి ఎవరికైనా ఇబ్బందులు ఉంటే ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రాల్లో వైద్యం పొందాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్‌ ఆఫీసర్‌ గీతిక , బంట్వారం సర్పంచ్‌ లావణ్య ,కోట్‌పల్లి ఎంపీటీసీ మహేష్‌గౌడ్‌ , సీహెచ్‌ఓ విజయ్‌కుమార్‌ ,సూపర్‌వైజర్‌ త్రివర్ణ ,ఫార్మాసిస్టు అమరేందర్‌ ,ఏఎన్‌ఎంలు అంజలి ,హేమలత ,అపర్ణ ,ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ప్రసాద్‌కుమార్‌ గెలుపు ఖాయం



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నేతలు

అనంతగిరి: వికారాబాద్‌లో మాజీమంత్రి ప్రసాద్‌ కుమార్‌ గెలుపు ఖాయమని మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌, కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని ప్రసాద్‌ కుమార్‌ నివాసంలో పట్టణ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఆనంద్‌ తీరు నచ్చకనే తాను కాంగ్రెస్‌ పార్టీలో చేరానని చెప్పారు. తన చేరిక బీఆర్‌ఎస్‌ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో వికారాబాద్‌లో కాంగ్రెస్‌ జెండా ఎగురుతోందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపునకు కృషి చేసి ఆనంద్‌ను ఓడిస్తామన్నారు. అనంతరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యేకు ఓటమి భయం పట్టుకుందన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌ నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లోకి చేరికలు ఉంటాయన్నారు. సమావేశంలో పీఏసీఎస్‌ మాజీ చైర్మన్‌ కిషన్‌నాయక్‌, రత్నారెడ్డి ,అయూబ్‌ అన్సారి, రాజశేఖర్‌, కౌన్సిలర్‌ మురళి ,వహీద్‌ మియా, శ్రీనివాస్‌, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అవి పక్కా ప్రభుత్వ భూములే..

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పరిగి: రాఘవపూర్‌ గ్రామంలోని సర్వే నంబర్‌ 94,95,96 భూములు పక్క సీలింగ్‌ ప్రభుత్వ భూములేనని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అధికారులు తప్పుడు ప్రకటనలతో తప్పును కప్పిపుచ్చుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాఘవపూర్‌ భూములు పక్కా ప్రభుత్వ భూములేనని మాదగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. అధికారులు ప్రజలను అప్పు దోవ పట్టించే కార్యక్రమం చేస్తున్నారని వాపోయారు. అధికారులతో తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

హోరెత్తిన అంగన్‌వాడీల ఆందోళన



తాండూరుటౌన్‌: ఆర్డీఓ కార్యాలయంలో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



పరిగి: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు



అనంతగిరి: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

తాండూరుటౌన్‌: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరింది. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. తమ హక్కుల సాధనకు పోరాటం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వారికి కనీస వేతనం రూ. 26వేలు, రిటైర్‌మెంట్‌ బెనిఫిట్స్‌ కింద టీచర్‌కు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ. 5లక్షలు చెల్లించాలన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే, 2018 నుంచి పెంచిన వేతనాన్ని ఏరియల్స్‌తో సహ చెల్లించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్‌ అండ్‌ హె ల్పర్స్‌ యూనియన్‌ సెక్టార్‌ లీడర్స్‌ జయంతి, శశికళ, రాజేశ్వరి, శోభ, సుధారాణి, అంజమ్మ, నర్సమ్మ, బాలమణి, వినోద, వసంత, వాణి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించం

పరిగి: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తునే ఉంటామని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనులు చేయించుకుని కనీస వేతనం చెల్లించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పర్మినెంట్‌ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌ డిమాండ్‌ చేశారు. నిరసనలో భాగంగా మంగళవారం వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సౌకర్యం కల్పించాలన్నారు. మిగతా ఉద్యోగులను పర్మినెంట్‌ చేసినట్లే తమకు కూడా ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకురాలు లక్ష్మి, భారతి, కళావతి, మనోహర , సుజాత, నిర్మల, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఆందోళన

మోమిన్‌పేట: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్‌ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా రెండవ రోజూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, బెనిఫిట్స్‌ను వర్తింపచేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచాలని కోరారు. ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సౌకర్యం కల్పించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని అన్నారు. లేనిచో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు భారతి, రేణుక ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచరులు ఉన్నారు.